క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని గూడెంగడ్డకు చెందిన శంకర్ వైద్య ఖర్చుల కోసం ఆయనకు రూ.రెండున్నర లక్షల ఎల్‌ఓసీ అందజేశారు.

చెట్ల కొమ్మల తొలగింపు



కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): సాక్షి కథనంపై విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్ తీగలను చెట్ల కొమ్మలు అల్లుకుపోవడంతో ప్రమాదం పొంచి ఉన్న విషయంపై సాక్షి దినపత్రికలో సోమవారం విద్యుత్ తీగలను అల్లుకున్న నిర్లక్ష్యం అనే కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిందిత విద్యుత్ సిబ్బంది స్పందించారు. మండల పరిధిలోని చండి గ్రామం నుంచి చండికాంబ ఆలయం వరకు ఉన్న విద్యుత్ లైన్‌కు చెట్ల కొమ్మలు అల్లుకుపోవడంతో గ్రామ లైన్‌మెన్ తొలగించారు. వర్షం కురిసినప్పుడు చెట్టును ముట్టుకుంటే విద్యుత్ షాక్ సమస్య పరిష్కారం కావడంపై గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అనూష

కౌడిపల్లి(నర్సాపూర్): హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని స్కోప్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్ అనూష అన్నారు. సోమవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఇంజక్షన్, రక్త మార్పిడి చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుమిత్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామకం



వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య

చిన్నశంకరంపేట(మెదక్): టీఎస్ ఎస్‌టీయూ అనుబంధ నమస్తే ఉపాధ్యాయ పత్రిక జిల్లా కన్వీనర్‌గా చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాల ఉపాధ్యాయుడు వినయ్ కుమార్ ఎంపికైనట్లు ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య తెలిపారు. సోమవారం జెడ్పీపాఠశాల ఆవరణలో వినయ్‌కుమార్‌ను ఎస్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ అధ్యక్షుడు శివప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సతీష్, నాగరాజ్, కిషన్, రతన్, నవీన్ ఉన్నారు.

ఎస్టీ హాస్టల్‌లో సమస్యలు

గజ్వేల్: గజ్వేల్‌లోని ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన 'గ్రీవెన్స్ డే'లో దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి వినతిపత్రం అందజేశారు. ఎస్టీ హాస్టల్ భవనం పెచ్చులూడి, కిటికీలు విరిగి అధ్వానంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు, గ్లాసులు ఇవ్వలేదని వాపోయారు. జిల్లాలోని హాస్టళ్లల్లో పారిశుద్ధ్యలోపం నివారించాలని, ట్యూటర్లను నియమించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కోరారు.

మీసేవలో సాంకేతిక సమస్య

- దివ్యాంగులకు శాపం
- నేడే సదరం క్యాంపు
- దరఖాస్తుకు అవకాశం లేక అవస్థలు



ఆగిపోయిన సైట్

మెదక్ కలెక్టరేట్: మీ సేవల్లో కొన్ని రోజులుగా ఏర్పడిన సాంకేతిక సమస్య దివ్యాంగులకు శాపంగా మారింది. దివ్యాంగులు ధృవీకరణ పత్రం పొందాలన్నా.. సర్టిఫికెట్ కలిగిన వారు రెన్యువల్ చేసుకోవాలన్నా.. మీసేవల్లో స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం వారికి మీ సేవల ద్వారా కేటాయించిన తేదీల్లో సదరం క్యాంపునకు హాజరు కావాల్సి ఉంటుంది. అయితే ఈనెల 10 నుంచి మీసేవల్లో సదరం క్యాంపునకు సంబంధించిన సైట్ పని చేయడం లేదు. మీ సేవ కేంద్రాల నిర్వాహకులను ప్రశ్నించగా.. పై నుంచి సర్వర్ రావడం లేదని చెబుతున్నారు.

నేడు సదరం క్యాంపు ముగింపు

మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల నిర్వహించే సదరం క్యాంపు మంగళవారంతో ముగియనుంది. దీంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తమకు న్యాయం చేయాలంటూ పలువురు దివ్యాంగులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ విషయమై ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్‌ను వివరణ కోరగా.. హైదరాబాద్ నుంచి రావాల్సిన సర్వర్‌లో క్రాష్ ఏర్పడటంతో సైట్ ఆగిపోయినట్లు తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారం కానున్నట్లు చెప్పారు.

మూడు నెలలుగా పింఛన్ రావడం లేదు



గతంలోనే సదరం సర్టిఫికెట్ పొందిన ఏడాది మే నెలతో సర్టిఫికెట్ గడువు ముగిసింది. దీంతో పెన్షన్ ఆగిపోయింది. మూడు నెలలుగా పింఛన్ ఇస్తలేరు. నిరుపేద దివ్యాంగుడినైన అనేక అవస్థలు పడుతున్నా. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ కావడం లేదు. మంగళవారమే సదరం క్యాంపు ఉంది. దీంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– సంజీవ్, ఝాన్సిలింగాపూర్

అధికారులు సమాచారం ఇవ్వడంలేదు



నేను తల్లిదండ్రి లేని అనాథను. మూడు నెలలుగా పెన్షన్ వస్తలేదు. దివ్యాంగుడినైన నాకు సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకోవాలని అధికారులు చెప్పలేదు. సదరం క్యాంపు తేదీ కోసం ఫోన్ చేస్తామని చేయలేదు. దీంతో సర్టిఫికెట్ గడువు ముగిసింది. ప్రస్తుతం స్లాట్ బుక్ చేసుకుందామంటే మీసేవలో పనిచేయడం లేదు.

– కదమంచి శ్రీనివాస్, ఉప్పులింగాపూర్

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



నివేదిక పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయం ఆవరణలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీడీ రంగాచారి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఒకరి జాబ్‌కార్డుపై మరొకరు పనులు చేస్తే వాటికి పేమెంట్ చేసినట్లు, నిబంధనలకు విరుద్ధంగా కొన్ని గ్రామాల్లో ఆశవర్కర్లు, అంగన్‌వాడీ ఆయాలు ఉపాధి పనులు చేశారన్నారు. మస్టర్‌ల నిర్వహణ సరిగాలేదని, ట్యాంకర్ పేమెంట్స్ లాంగ్ బుక్స్ ఇవ్వలేదని చెప్పారు. అదేవిధంగా అక్కడక్కడా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయినట్లు తనిఖీ బృందం సభ్యులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏ పీ డీ రంగాచారి మాట్లాడుతూ.. ఒకరికి బదులు మరొకరు పనిచేస్తే బిల్లులు చెల్లించినందుకు, ఎక్సస్ పేమెంట్ చేసినందుకు ఉమ్మడి మండలంలో రూ. 1.70 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. అదేవిధంగా విధులు సక్రమంగా నిర్వహించినందుకు సిబ్బందికి రూ. 60 వేలు జరిమానా విధించామన్నారు. తనిఖీలో విజిలెన్స్ ఆఫీసర్ శ్రీహరి, ఎంపీడీఓ ఉమాదేవి, ఈజీఎస్ ఏపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



గొల్లగూడెంలో సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

టేక్మాల్(మెదక్): బీజేపీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరామ్ అన్నారు. సోమవారం మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఇంటింటా తిరుగుతూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదుకు మంచి ఆదరణ వస్తుందన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం అని, ప్రతీ కార్యకర్త గ్రామస్థాయిలో సభ్యత్వం నమోదు విస్తృతంగా చేయాలన్నారు. ఇప్పటి వరకు అత్యధిక సభ్యత్వ నమోదులో బీజేపీ ముందు ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎల్లుపేట రాజు, మండల ఉపాధ్యక్షుడు వడ్డె రాములు, పార్టీ యువ మోర్చా అధ్యక్షులు వడ్ల పవన్, నాయకులు రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ పవిత్రతను కాపాడాలి

- బ్రాహ్మణ సంఘం సభ్యులు



పెద్దశంకరంపేటలో పూజలు నిర్వహిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

పెద్దశంకరంపేట(మెదక్): కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి లడ్డూ విశిష్టతను కాపాడాలని కోరుతూ మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మాణిక్‌ప్రభు దేవాలయంలో ప్రాయశ్చిత శాంతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ మండలాధ్యక్షుడు రామచంద్రాచారి, బ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు కృష్ణశర్మ, రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షుడు చంద్రశేఖరశర్మ మాట్లాడుతూ.. పవిత్రమైన తిరుమల లడ్డూ విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో సభ్యులు మహేశ్‌శర్మ, అనంతరాజశర్మ, ఫణిందర్, రాము, గుడి రామన్న, గిరిధర్‌శర్మ, రాకేష్‌శర్మ తదితరులు ఉన్నారు.

కస్తూర్బా ప్రిన్సిపాల్‌గా విజయలక్ష్మి

పెద్దశంకరంపేట(మెదక్): పేట మండల కస్తూర్బా ప్రిన్సిపాల్‌గా విజయలక్ష్మి నియమితులయ్యారు. ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో ఆమె పేట ప్రిన్సిపాల్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ నాగరాణి సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం చౌటకూర్ ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు.

అక్రమ మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు

మనోహరాబాద్(తూప్రాన్): టీఎస్ఐసీసీ భూముల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ఐలా మేనేజర్ దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొండాపూర్ ఐలా భూముల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సాక్షి కథనం మేరకు స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు. మట్టిని అక్రమ రవాణా చేస్తే ఐలా దృష్టికి తేవాలన్నారు.

సరుకుల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో గ్రామ పంచాయతీ కార్మికులకు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మల్లికార్జున్



మెదక్ పట్టణంలో చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మల్లికార్జున్ పేర్కొన్నారు. మెదక్ పట్టణంలో సోమవారం స్వచ్ఛత హీ సేవా 2024 నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసిన చెరువుల దగ్గర మున్సిపల్ సిబ్బంది చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్రతీ వారానికి రెండు గంటల పాటు శ్రమదానం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మహేశ్, పర్యావరణ ఇంజనీర్ వెంకటేష్, వార్డ్ ఆఫీసర్లు నాగరాజు, మహబూబ్, శానిటరీ జవాన్లు శ్రీను, శ్యామ్ సంజీవ్, శానిటేషన్ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి



శివ్వంపేట(నర్సాపూర్): ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): బ్యాంకుల నుంచి మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్ అన్నారు. సోమవారం శివ్వంపేట మండల మహిళా సమాఖ్య 16వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ మహిళా మొక్కలు నాటి, మూడు సంవత్సరాల పాటు వాటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. పచ్చదనం పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సాయిసౌమ్య, ఏపీఎం వెంకటేశ్వర్లు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నవనీత, తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



నిజాంపేట(మెదక్): ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

నిజాంపేట(మెదక్): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని మండల ఏపీఎం రాములు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఏపీఎం ఆధ్వర్యంలో మండల సమైఖ్య మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా బీపీఎం కెనెడి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు లింకుల ద్వారా శ్రీనిధి పథకం స్కీముల ద్వారా, ఎస్‌హెచ్‌జీ గ్రూపుల మహిళలు అభివృద్ధి చెందారన్నారు. రుణాల్లో నెలవారి చెల్లింపులు చేయకపోతే ఆ గ్రూపు మొత్తానికి మిగతా వడ్డీ రుణాలు రావని తెలిపారు. ప్రతీ మహిళా ఒక మొక్కను పెట్టాలని తీర్మానించారు. అనంతరం పోషణ మాసం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎంజీ నాగరాజు, సీసీలు, అకౌంటెంట్లు, మహిళా గ్రూపుల సభ్యులు పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్ల లీకేజీలు ఉండొద్దు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసాచారి



మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

కొండపాక(గజ్వేల్): మిషన్ భగీరథ నీటి సరఫరా పైప్‌లైన్లకు లీకేజీలు లేకుండా చూసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసాచారి సిబ్బందికి సూచించారు. స్థానిక ఐఓసీ కార్యాలయంలో తాగు నీటి సరఫరా సిబ్బందికి సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛమైన నీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టిందన్నారు. పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడడంతో నీరు కలుషితం అవుతుందని, ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయని వాపోయారు. ఓవర్ హెడ్ ట్యాంకులను తరుచూ శుభ్రం చేసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా తాగునీరు సరఫరా అయ్యేలా చూసుకోవాలని, ఇబ్బందులు ఏర్పడితే పంచాయతీ కార్యదర్శి, సరఫరా సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భూపతి, సూపరింటెండెంట్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని బూర్గుపల్లిలో 2009–10 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. వారు చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. ఉపాధ్యాయులు మల్లేశం, లక్ష్మణ్, గౌరీశంకర్‌శర్మ, నర్సింహులు, సుధాకర్, శ్రీనివాస్, బాలకిషన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం



లెక్చరర్స్‌ను సన్మానిస్తున్న సభ్యులు

మెదక్ కలెక్టరేట్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న లెక్చరర్స్‌ను సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తుకారాం, సంయుక్త కార్యదర్శిగా పూజ, కోశాధికారిగా భరత్‌కుమార్, మహిళా కార్యదర్శిగా హరితతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శశిధర్, నర్సింలు, కృష్ణారెడ్డిలు వ్యవహరించారు.

పెద్దశంకరంపేటలో...

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల బదిలీపై వెళ్లిన మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్‌తో పాటు ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి ప్రారంభిస్తున్న తహసీల్దార్

నర్సాపూర్: పట్టణంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు దరఖాస్తులు వచ్చాయని ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. వాటిలో మూడు ధరణి సమస్యలను పరిష్కరించాలని, ఇనాం సర్టిఫికెట్ జారీ చేయాలని మరో దరఖాస్తు వచ్చినట్లు ఆయన చెప్పారు. వాటిలో మూడు భూముల సమస్యలపై, రేషన్ కార్డు కావాలని మరో దరఖాస్తు వచ్చిందని తహసీల్దార్ శ్రీనివాస్ వివరించారు.

కౌడిపల్లిలో మూడు..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు భూ సమస్యపై దరఖాస్తు చేసినట్లు చెప్పారు.

చిన్నశంకరంపేటలో ఎనిమిది

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయలంలో నిర్వహించిన ప్రజావాణికి 8 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మన్నన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి సమస్యలపై సంబంధిత పత్రాలతో దరఖాస్తులు అందించాలన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సిన వాటిని ఆన్‌లైన్‌లో చేసిన తర్వాత తమకు కాపీ అందించాలని సూచించారు. నార్సింగి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్, ఐకేపీ ఏపీఓ ఆశోక్ ఉన్నారు.

అల్లాదుర్గం(మెదక్): ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లయ్య చెప్పారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో 3 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేషారెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహరెడ్డి, సదానందం, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



చిన్నశంకరంపేటలో ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మన్నన్

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజావాణిని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 6 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికులందరూ బ్లాక్ డేగా పాటించాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా పార్లమెంట్‌లో ఆమోదించినట్లు ఆరోపించారు. ఈ లేబర్ కోడ్లతో కార్మికులు చట్టపరమైన కనీస హక్కులు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పాత కోడ్‌లను అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాయిలు, గట్టయ్య, కుమార్, నవీన్, తదితరులు కార్మికులు పాల్గొన్నారు.